

పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

'సర్'కు మద్దతుగా పిటిషన్

సిగ్గుచేటు



డీఎంకే పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జులతో స్టాలిన్

● కొళత్తూరు సభలో అన్నాడీఎంకేపై స్టాలిన్ ధ్వజం

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ పాలకులకు పనిముట్టులా వ్యవహరిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) వల్ల రాష్ట్రంలో అర్హులైన ఓటర్లలో ఎవరూ ఓటు హక్కు కోల్పోకూడదనే సత్సంకల్పంతో తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే, అందుకు భిన్నంగా ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే పిటిషన్ వేయడం సిగ్గుచేటైన విషయమని ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. ప్రజలను నేరుగా కలుసుకోవడానికి ధైర్యం చాలక తప్పుడు మార్గాలను ఎంచుకుంటోందని, ఆ పార్టీ ఇలాగే సాగితే ప్రతిపక్ష పార్టీగానే గాక గుర్తింపులేని చిన్నా చితక పార్టీల జాబితాలోకి చేరటం ఖాయమని స్టాలిన్ ఘుండిపడ్డారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టినందువల్ల ప్రతి వ్యక్తి తాను భారతీయుడని నిరూపించుకోవాల్సిన ఆగత్యం ఏర్పడిందని, ఎన్నికల సంఘం ఇంతటి భారాన్ని ప్రజలపై మోపిందని, వీటన్నింటికి మూలకారకులు కేంద్రంలోని బీజేపీ పాలకులే అన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు సర్‌పై తమ తీవ్ర వ్యతిరేకత స్పష్టంగా తెలియజేశాయని చెప్పారు. రాష్ట్రంలో సర్ ప్రారంభించి పది రోజులు దాటిందని, ఇంకా ఇరవై రోజులే మిగిలిందని, ఈ తక్కువ సమయంలో నిజమైన ఓటర్ల పేర్లు జాబితాల నుండి తొలగించకుండా పార్టీ శ్రేణులు, ఆయా పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జులు నిఘా వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సిబ్బంది ఇచ్చే ఫారాలను పూర్తి చేయడానికి ప్రజలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సిబ్బంది ఇచ్చే ఫారాలను చూస్తేనే తల తిరుగుతుదని, వాటిని ఎలా పూర్తి చేయాలో తెలియక ఓటర్లు అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంలో డీఎంకే స్థానిక నాయకులు ఆ ఫారాలను భర్తీ చేయడానికి ఓటర్లకు అన్ని విధాలా సహకరించాలని తెలిపారు. ముఖ్యమంత్రిగా అన్ని ప్రాంతాలకు వెళ్ళినా తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో పర్యటించే సమయంలో ఆనందం కలుగుతుందని ఈ నియోజకవర్గం ప్రజలు తనపట్ల చూపుతున్న ఆదరాభిమానాలను వర్ణించలేనని స్టాలిన్ ఉద్వేగంగా తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం ప్రజలు తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారనే నమ్మకం తనకుందని అన్నారు.

గ్రంధాలయం ప్రారంభం

కొళత్తూరు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి స్టాలిన్ పెరియార్ నగర్‌లో రూ.5.24 కోట్లతో పునర్నిర్మించిన గ్రంథాలయం, ముదల్వర్ పడైప్పగమ్‌ను, పెరియమేడులో రూ.3.86 కోట్లతో నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పెరియార్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.68 లక్షలతో నిర్మించనున్న కేవ్ పెరవళ్లూరు సబర్బన్ పోలీసు స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు పి. మూర్తి, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్. ప్రియా, ఎంపీలు కళానిధి వీరాసామి, గిరిరాజన్ శాసనసభ్యులు ఇ.పరంధామన్, వెట్రి అళగన్, తాయగం కవి, జోసెఫ్ సామువేల్, తమిళనాడు గిడ్డంగుల సంస్థ అధ్యక్షుడు రంగనాథన్, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు డీఎంకే సన్నాహాలు

అసెంబ్లీ ఎన్నికల్లో మైనారిటీల ఓటు బ్యాంక్ స్థిరంగా ఉంచుకునే దిశగా డీఎంకే తగు చర్యలు చేపడుతోంది. ఎన్నికల్లో క్రైస్తవులు డీఎంకేకు గట్టి మద్దతిచ్చి ఓటేసి గెలిపిస్తుంటారు.. ఈ సారి నటుడు విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించడంతో మైనారిటీల ఓట్లు టీవీకేకు పడతాయని ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్‌లో క్రిస్మస్ వేడుకలను గతం కంటే ఘనంగా జరిపేందుకు డీఎంకే సిద్ధమవుతోంది. ఆ ప్రయత్నాలలో భాగంగానే గురువారం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ క్రైస్తవ మతాధికారులతో భేటీ అయ్యారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఇనికో ఇరుదయరాజ్ నాయకత్వంలో ఈ మతాధిపతులు స్టాలిన్‌ను కలుసుకున్నారు. ఈ సారి రాష్ట్రంలోని ప్రధాన నగరాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరపాలని, ఆ వేడుకలకు స్టాలిన్‌ను ఆహ్వానించాలని క్రైస్తవమతాధికారులు నిర్ణయించారు.

సీనియర్ దర్శకుడు
శేఖర్ కన్నుమూత



వి.శేఖర్ (ఫైల్‌ఫొటో)

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సినీ దర్శకుడు వి.శేఖర్ (73) అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. కోడంబాక్కంలో నివశిస్తున్న ఆయన పది రోజులుగా అనారోగ్యం కారణంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మృతికి కోలీవుడ్‌కు చెందిన సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ తమ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. 'నీంగలుమ్ హీరోదాన్' అనే చిత్రం ద్వారా 1990లో దర్శకుడిగా పరిచయమైన వి.శేఖర్.. 'పొండాట్టి సొన్న కేక్కనుమ్', 'విరలుక్కేత్త వీక్కం', 'వరవు ఎట్టణ సెలవు పత్తణ' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ఒక చిత్రంలో ప్రముఖ హాస్య నటులు దివంగత వివేక్, వడివేలును తొలిసారి వెండితెరపై చూపించారు. తిరువణ్ణామలై జిల్లా నెయ్‌వాత్తం గ్రామానికి చెందిన ఆయన తన 19 యేట ఏవీఎం స్టూడియోలో 'బ్లాక్ అండ్ వైట్ 16 ఎంఎం ల్యాబ్‌లో అసిస్టెంట్‌గా చేరారు. ఆ తర్వాత చెన్నై కార్పొరేషన్‌లో ఆరోగ్య శాఖ విభాగంలో 15 యేళ్ళ పాట పనిచేశారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే నందనం ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ పూర్తి చేశారు. ఆ తర్వాత పార్ట్‌టైమ్ ఎడిటర్‌గా చేరారు. దర్శక నటుడు కె.భాగ్యరాజ్ శిష్యుడు గోవిందరాజ్ దర్శకత్వం వహించిన 'కణ్ణ తోర్కనుం సామి' అనే చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసిన ఆయన తర్వాత కె.భాగ్యరాజ్ వద్ద రెండేళ్ళపాటు కథ రచనా విభాగంలో కొనసాగారు. 1990లో తొలిసారి దర్శకత్వం వహించి విజయాన్ని అందుకున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల జీవన విధానం, కుటుంబ సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా పలు చిత్రాలు తీశారు..

రాష్ట్రంలో ముమ్మరంగా 'సర్'


● 31 నియోజకవర్గాలకు అదనపు ఏపీవోలు

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పనులను ఎన్నికల కమిషన్ వేగవంతం చేసింది. డిసెంబరులోగా ఈ పనులను పారదర్శకంగా పూర్తిచేయాలన్న లక్ష్యంతో 31 నియోజకవర్గాలకు అదనంగా అసిస్టెంట్ పోలింగ్ అధికారులు (ఏపీవో)లను నియమించింది. రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో ఈ నెల 4న ప్రారంభించిన సర్ పనులు డిసెంబరు 4వ తేదీకి పూర్తిచేయనుంది. దీనికోసం 72 మంది బీఎల్వోలను ఈసీ నియమించింది. ఈ నేపథ్యంలో, అదనంగా ఎన్నికల అధికారులుగా నియమించాలని ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు 31 అసెంబ్లీ నియోజకవర్గాల జిల్లాల కలెక్టర్లను కోరాయి. దీనిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల కమిషన్ అవసరమైన ప్రాంతాల్లో అదనంగా ఇద్దరిని ఏపీవో లుగా నియమించుకోవచ్చని ప్రకటించింది.

తిరుచెందూరులో కుండపోత

● శివాలయంలోకి చేరిన వర్షపునీరు

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం కుండపోతగా వర్షం కురిసింది. తిరుచెందూరు, రామసామిపురం, నాలుమూలైకినరు, పరమన్‌కురిచ్చి, మెయ్‌జ్ఞానపురం, కాయామొళి, దళవాయ్‌పురం, వీరపాండియపట్టినం తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. తెరుచెందూరులో గంటకు పైగా కురిసిన భారీ వర్షానికి అక్కడి శివాలయంలోకి వర్షపునీరు వరదలా ప్రవహించింది. వేకువజామున జల్లులతో ప్రాంభమైన ఈ వర్షం ఉదయం 8.30 గంటలకు కుండబపోతగా మారింది. ఈ వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ నీటమునిగాయి.



తిరుచెందూరు శివాలయంలో ప్రవహిస్తున్న వర్షపునీరు

టీవీకేలో నాయకులకు
డిజిటల్ ఐడీ కార్డులు



టీవీకే డిజిటల్ గుర్తింపు కార్డు

చెన్నై, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రికళగం' (టీవీకే)లో లక్ష మంది పార్టీ నాయకులకు డిజిటల్ గుర్తింపు కార్డుల పంపిణీకి ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీలో కొత్త కార్యవర్గాలను, విభాగాలను ఏర్పాటు చేసి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేయడంతో ఆయన బిజీగా ఉన్నారు. అదే సమయంలో పార్టీలోని ప్రముఖులకు కీలకమైన పదవులు కూడా కట్టబెడుతున్నారు. ఇప్పటివరకూ ఆ పార్టీలో 1.20లక్షల మందికి పార్టీ పదవులు కేటాయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్తగా నియమితులైననాయకులకు పయ్యనూరులోని పార్టీ కార్యాలయంలో డిజిటల్ గుర్తింపు కార్డులను విజయ్ పంపిణీ చేశారు.

'సర్' వ్యతిరేక ఆందోళనకు జనసమీకరణ...

కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్‌కు వ్యతిరేకంగా ఈ నెల 16న జరుపతలపెట్టిన ధర్నాకు పార్టీ శ్రేణులను, జనాలను భారీ సంఖ్యలో తరలించాలని విజయ్ ఆదేశించారు. రాజధాని నగరం చెన్నైలో జరిగే ఆందోళనకు సుమారు 10 వేల మందిని తరలించాలని, అందుకు తగినట్లుగా వివిధ జిల్లాల నుండి పార్టీ శ్రేణులకు వాహనసదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని జిల్లా నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాను జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిపేందుకు పోలీసుల అనుమతి కోరగా, ఎగ్మూరు రాజరత్నం స్టేడియం వద్ద జరుపుకోవాలని సూచించారు. ఆ మేరకు టీవీకే నిర్వాహకులు ఎగ్మూరు వద్దే ఆందోళన జరిపేందుకు సమయాత్తమవుతున్నారు.

డీఎంకేలో మైత్రేయన్‌కు పదవి



డాక్టర్ మైత్రేయన్

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ఆగస్టులో అన్నాడీఎంకేకి గుడ్‌బై చెప్పి డీఎంకే సభ్యత్వం స్వీకరించిన మాజీ ఎంపీ డాక్టర్ మైత్రేయన్‌కు కొత్త పదవి వరించింది. డీఎంకే విద్యావేత్తల విభాగం ఉపాధ్యక్షుడిగా మైత్రేయన్‌ను నియమిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ శుక్రవారం ప్రకటించారు. మైత్రేయన్ 2002 నుండి మూడు సార్లు అన్నాడీఎంకే నుంచి రాజ్యసభ సభ్యుడిగా, ఆ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆయనకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సీటు కేటాయించలేదు. దీంతో రాజకీయాలకు దూరంగా వ్యవహరిస్తూ వచ్చిన మైత్రేయన్ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

కరూర్ దుర్ఘటన..

నాలుగో రోజూ క్షతగాత్రుల విచారణ

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే నేత విజయ్ రోడ్‌షో సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి చికిత్స పొంది కోలుకున్న వారిని శుక్రవారం కూడా సీబీఐ అధికారులు విచారించారు. గత మూడు రోజులుగా తొక్కిసలాటలో గాయపడిన వారిని విచారించి వాంగూల్మం నమోదు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మళ్ళీ ఏడుగురు క్షతగాత్రుల వద్ద సీబీఐ అధికారులు విచారణ జరిపారు.



సీబీఐ కార్యాలయం వద్ద క్షత్రగాత్రుల వివరాలను పరిశీలిస్తున్న పోలీసులు

బిహార్‌లో విజయంపై బీజేపీ సంబరాలు

● పలుచోట్ల బాణసంచా కాల్చి, మిఠాయిల పంపిణీ
● మోదీ పాలనకు మరో ప్రజామోదం ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సాధించడంతో రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయమైన కమలాలయం వద్ద బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే, తిరునల్వేలిలో ఉన్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ బిహార్ ఎన్నికల ఫలితాల గురించి మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల దేశప్రజల్లో విశ్వాసం పెరిగిందని, అందువల్లే బిహార్ ఎన్నికల్లో కమలం పార్టీ నాయకత్వం వహించిన కూటమిని ఆ రాష్ట్రప్రజలు మళ్లీ గెలిపించారన్నారు. 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో కూడా ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్, ఈడీ, ఐటీ శాఖలు స్వచ్ఛందంగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తాయని, వీటిని రాజకీయ పార్టీలతో పోల్చడం సరికాదన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే మెజారిటీ సీట్లలో గెలిచి అధికారంలో కూర్చుందని, అప్పట్లో ఎన్నికల కమిషన్ పనితీరు మెచ్చుకున్న డీఎంకే కూటమి పార్టీలు ఇప్పుడు బిహార్‌లో ఇండియా కూటమి చిత్తుగా ఓడిపోవడంతో ఈసీ విమర్శించడం న్యాయం కాదని నయినార్ పేర్కొన్నారు.



కమలాలయం ముందు సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

బిహార్ విజయం ప్రజాస్వామ్య పార్టీలకు గుర్తింపు : ఈపీఎస్

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సాధించిన విజయం ప్రజాస్వామ్య పార్టీలకు దక్కిన గుర్తింపు అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పేర్కొన్నారు. బిహార్ ఎన్నికల్లో బీజేపీ- జనతా దళ్ కూటమి సాధించిన ఘన విజయంపై ఈపీఎస్ స్పందించారు. ఆయన శుక్రవారం సేలం విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. బిహార్ ప్రజలు ఇండియా కూటమికి తగిన గుణపాఠం నేర్పారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిషా, బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నేతృత్వంలో బిహార్ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సర్వే ద్వారా రాష్ట్రంలో బోగస్ ఓటర్లకు అవకాశం ఉండబోదన్నారు. అయితే ఎస్ఐఆర్ పనుల్లో ఎన్నికలపై అనుభవంలేని ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో వేలాది మంది మృతిచెందిన, నకిలీ ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుండి తొలగించలేదని, ఈ ఓట్లతోనే డీఎంకే ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో గెలిచిందని ఈపీఎస్ విమర్శించారు.

62 నియోజకవర్గాల్లో పర్యటించనున్న ఎడప్పాడి

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో, ఐదు విడతల పర్యటన పూర్తి చేసిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరో విడతలో 62 నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ప్రధాన నగరాల్లో పార్టీ మహానాడును భారీస్థాయిలో నిర్వహిస్తారని అన్నాడీఎంకే వర్గాలు తెలిపాయి.

కోవై కలెక్టరేట్‌కు తొమ్మిదోసారి బాంబు బెదిరింపు !

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తొమ్మిదోసారి బాంబు బెదిరింపు వచ్చిం ది. కలెక్టరేట్ కార్యాలయంలో బాంబులు ఉన్నాయని, త్వరలో అవి పేలనున్నాయని శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి ఈమెయిల్ పంపాడు.అది చూసి దిగ్భ్రాంతి చెందిన సిబ్బంది ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. ఆ తర్వాత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో వెళ్ళి కలెక్టరేట్ గదులు, కార్యాలయం చుట్టూ పార్కింగ్ చేసి ఉన్న వాహనాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసి, చివరకు అది ఉత్తుత్తి బెదిరింపేనని నిర్ధారణ అయ్యింది.

సేలం కలెక్టరేట్‌కు ...

సేలం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూడా బాంబు బెదిరింపు వచ్చింది. ఈ కార్యాలయానికి ఇప్పటికే మూడుసార్లు బాంబు బెదిరింపులు వచ్చాయి. శుక్రవారం ఉదయం ఉద్యోగులందరూ విధులకు హాజరవుతుండగా కలెక్టరేట్‌లో బాంబులున్నాయని, త్వరలో అవి పేలనున్నాయని గుర్తు తెలియని వ్యక్తి ఈమెయిల్ పంపాడు. వెంటనే కార్యాలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాంబ్ స్క్వాడ్ నిపుణులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి తనిఖీ చేశారు. పోలీసు జాగిలం 'రూబీ'తో కార్యాలయంలోని అన్ని గదుల్లో తనిఖీ చేయించారు. చివరకు ఇది ఉత్తుత్తి బాంబు బెదరింపని పోలీసులు ప్రకటించారు.





కోవై కలెక్టరేట్ పార్కింగ్‌లో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ - సేలం కలెక్టర్ కార్యాలయంలో ఓ గదిలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ఢిల్లీ వెళ్ళిన గవర్నర్

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి ఢిల్లీ వెళ్ళారు. శుక్రవారం ఉదయం 8.05 గంటలకు ఎయిర్ ఇండియా విమానంలో హస్తినకు బయలుదేరి వెళ్ళారు. ఆయన వెంటన వ్యక్తిగత కార్యదర్శి, భద్రతా అధికారి, ఒక సహాయకుడు ఉన్నారు. గత వారం ఒక సారి వెళ్ళిన గవర్నర్ ఇపుడు మరోమారు వెళ్ళడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యే, ఎంపీల కేసులను త్వరితగతిన విచారించండి

● మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలపై నమోదై, ఐదేళ్లుగా పెండింగులో ఉన్న అవినీతి కేసులపై త్వరితగతిన విచారణ జరపాలని మద్రాస్ హైకోర్టు ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆదేశించింది. సీనియర్ న్యాయవాది శ్రీనాథ్ శ్రీదేవన్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో సెప్టెంబరు 31 వరకు రాష్ట్రంలో మాజీ, సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా 192 కేసులు, అలాగే పుదుచ్చేరిలో 23 కేసులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. వీటిలో కొన్ని కేసులకు సుప్రీంకోర్టు, హైకోర్టు స్టే విధించిన కారణంగా రోజుల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని ఆ పిటిషన్‌లో తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీలపై నమోదైన అవినీతి కేసులపై విచారణ జరిపే కోర్టులు, స్టే విధించిన కేసులను త్వరితగతిన విచారించి ముగించాలని ఆయన న్యాయస్థానాన్ని కోరారు. ఈ అభ్యర్థన పరిశీలించిన న్యాయస్థానం పెండింగులో ఉన్న కేసులను రెండు వారాల్లో విచారణ పూర్తిచేసి నివేదిక దాఖలు చేయాల్సిందిగా ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.

సమాచార దర్శిని

24న కాట్పాడి మీదుగా కొట్టాయంకు ప్రత్యేక రైలు

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శబరిమల క్షేత్రంలో అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం కాట్పాడి -సేలం మీదుగా కొట్టాయం వరకు ఈ నెల 24న ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. శబరిమలై భక్తుల కోసం తెలంగాణ రాష్ట్రం చర్లపల్లి నుండి కేరళలోని కొట్టాయం వరకు ప్రత్యేక రైలు నడుపుతున్నారు. ఈ రైలు 24వ తేదీ ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. మరుమార్గంలో కొట్టాయం నుంచి నవంబరు 25వ తేదీ రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్ రైల్వే స్టేషన్లలో ఆగివెళుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

రేపు చిన్నారులకు చెస్ పోటీలు

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోళయూర్‌లో ఉన్న గుహన్స్ పాఠశాలలో ఆదివారం చిన్నారులకు రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు హయగ్రీవ చెస్ అకాడమీ ప్రకటించింది. పిల్లల్లో క్రీడాస్ఫూర్తి పెంచే విధంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 8, 10, 13, 25యేళ్లలోపున్న బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలుంటాయని, పాల్గొనదలచిన వారు 720010 1544 అనే నెంబరును సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

రేపు కార్తీక వనభోజనాలు

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెన్నపురి తెలుగు విశ్వకర్మ సమాజం ఆధ్వర్యంలో స్థానిక కొరట్టూరు వాటర్‌కెనాల్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో ఆదివారం కార్తిక వనభోజనాల, సమారాధన జరగనుంది. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉసిరిచెట్టు దీపారాధన, సత్యనారాయణ వ్రతం, ఆటల పోటీలు, తెలుగింటి భోజనాలు, బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాల్లో సమాజం సభ్యులు పాల్గొనాలని సమాజం అధ్యక్షులు కణితి రాంబాబు, ప్రధాన కార్యదర్శి వై.వసుమతి, నూతక్కి జగదీష్ తదితరులు పిలుపునిచ్చారు.

రేపు పెరంబూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం వ్యవస్థాపక దినోత్సవం

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు కుక్స్‌రోడ్డులోని ది వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చి (డబ్ల్యూఎంటీబీసీ) 140వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుండి బైబిల్ క్విజ్, వక్తృత్వ, ఆంధ్రా క్రైస్తవ కీర్తనల పోటీలు నిర్వహించనున్నారు. న్యాయనిర్ణేతలుగా సంఘ కాపిరి రెవ.డా.ఎం.పాల్ ఈశ్వరప్ప, రెవ.ఆరోన్ దయాన్, పి.మదన్‌మోహన్, గాస్పల్ సింగర్ కె.జయరాజు వ్యవహరిస్తారు. పోటీలో విజేతలకు చివరగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎల్.మోహన్‌కుమార్, జి.నాగేశ్వరరావు, బీఎస్.జీవన్‌బాబు, పి.సాంసన్, డిజె యెషయాబాబు, కమిటీ సభ్యులు ఓ ప్రకటన విడుదల చేశారు.

పెరిగిన కోడిగుడ్ల ధర

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్ల ఉత్పత్తి, ఎగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న నామక్కల్ జోన్‌లో కోడిగుడ్ల కొనుగోలు ధర పెరిగింది గురువారం వరకు రూ.5.80పైసలున్న కోడిగుడ్డు ధరను నామక్కల్‌లో జరిగిన జాతీయ కోడిగుడ్ల సమన్వయ కమిటీ సమావేశంలో గుడ్డు ధరను ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రూ.5పైసలు పెంచాలని నిర్ణయించారు. అందువల్ల కోడిగుడ్డు కొనుగోలు ధర రూ.5.85 పైసలు పెరిగింది. కాగా, కోడిగుడ్ల కొనుగోలు ధర పెరగడంతో కోళ్ల పెంపకం దారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నేడు పళ్ళిపాళయంలో అన్నాడీఎంకే ధర్నా

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా కుమారపాళయం నియోజకవర్గం పళ్ళిపాళయంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. ఆ ఆందోళనకు పార్టీ శాసనసభ్యులు తంగమణి నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు.

15, 16 తేదీల్లో 'టెట్'

● 4.80 లక్షల మంది హాజరు

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శని, ఆదివారాలు (ఈ నెల 15,16 తేదీలు) ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జరుగనుంది. సెకండ రీ గ్రేడ్ ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారికి పేపరు -1, బీఎడ్ పూర్తిచేసిన పట్టభద్రులకు పేపరు-2 పరీక్ష నిర్వహిస్తుంటారు. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష ఈ నెల 1,2 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తొలుత ప్రకటించారు. సమాధుల పండుగ కారణంగా ఈ నెల 15,16 తేదీలకు మార్చారు. ఈ ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా శని, ఆదివారాల్లో టెట్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సుమారు 4.80 లక్షల మంది హాజరుకానున్నారు. శనివారం జరిగే పేపర్-1 పరీక్షకు లక్ష 370 మంది, ఆదివారం పేపర్-2 పరీక్షకు 3,73,438 మంది హాజరుకానున్నారు. పేపర్-1 పరీక్షకు 367 కేంద్రాలు, పేపర్-2 పరీక్షకు 1,241 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగనుంది. అభ్యర్థులు ఉదయం 9.40 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని టీఆర్బీ సభ్యుడు రామేశ్వర మురుగన్ తెలిపారు. దివ్యాంగులకు అదనంగా ఒక గంట కేటాయిస్తున్నట్లు తెలిపారు.

శబరిమలలో పారిశుధ్య పనులకు 1125 మంది వాలంటీర్లు

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శబరిమల మండల, మహా దీపారాధ సమయాల్లో సన్నిధానం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు రాష్ట్రానికి చెందిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం తరపున 1,125 మంది వాలంటీర్లు వెళ్లారు. వీరు మహాజ్యోతి దర్శనం తర్వాత జనవరి చివరి వారం వరకు సేవల్లో పాల్గొననున్నారు. ఈ విషయమై ఆ సంఘం అధ్యక్షుడు విశ్వనాథన్ మాట్లాడుతూ.. శబరిమల హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవకులు పనిచేస్తున్నారన్నారు. బంధనతిట్ట జిల్లా యంత్రాంగం అభ్యర్థన మేరకు, 60 ఏళ్ల వయస్సు కంటే తక్కువ ఉన్న వారిని రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేశామన్నారు.

'సెంట్రల్ బ్యాంక్' ఆధ్వర్యంలో వ్యవసాయ రుణ మేళా



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బ్యాంకు జనరల్ మేనేజర్ వస్తి వెంకటేష్, చెన్నై జోన హెడ్ కె.శశిధర్ తదితరులు

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెన్నై జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లోని 323 శాఖల్లో వ్యవసాయ రుణాల శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో రైతులు, వ్యవసాయదారులు, వినియోగదారులు పాల్గొన్నారు. ధర్మపురిలో జరిగిన కోయంబత్తూరు ప్రాంతీయ స్థాయి శిబిరంలో ధర్మపురి జిల్లా తమిళనాడు ప్రభుత్వ వ్యవసాయ సంయుక్త డైరెక్టర్ ఆర్.రత్నం, బ్యాంక్ ప్రధాన కార్యాలయమైన ముంబై నుంచి ట్రెజరీ జనరల్ మేనేజర్ వస్తి వెంకటేష్, చెన్నై జోనల్ హెడ్ కె.శశిధర్, ఎస్.రామజయం, ఎల్‌డీఎం ధర్మపురి, కోయంబత్తూరు ప్రాంతీయ అధిపతి జ్యోతిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 300 మంది రైతులు ఈ శిబిరంలో రుణ మంజూరు పత్రాలు అందుకున్నారు. అదేవిధంగా చెన్నై రీజియన్ పరిధిలోని మేల్‌మరువత్తూరు ఎంఏపీఐఎంఎస్ కళాశాలలో జరిగిన శిబిరంలో 300 మంది లబ్ధిదారులు రుణ పత్రాలు అందుకున్నారు. చెన్నై రీజినల్ హెడ్ పవన్ అగర్వాల్, అన్నిగమక్కల్ తొండు ఇయక్కం నుంచి సుందరం, ఎస్‌హెచ్‌జీ సభ్యులు కూడా పాల్గొన్నారు. మదురై రీజియన్‌లో ముక్కానికిలో జరిగిన కార్యక్రమంలో 150 మంది వినియోగదారులు పాల్గొన్నారు. మదురై రీజినల్ హెడ్ సంజయ్‌కుమార్, ఏజీఎం రాకేష్ లూవా తదితరులు ఈ శిబిరానికి హాజరయ్యారు. అదేవిధంగా తిరుచ్చి రీజియన్‌లో జరిగిన శిబిరంలో 200 మంది వ్యవసాయ వినియోగదారులు హాజరు కాగా, చెన్నై జోనల్ కార్యాలయం నుంచి రీజనల్ హెడ్ జి.సెల్వలక్ష్మి, ఏజీఎం రమేష్ తదితరులు రుణ మంజూరు పత్రాలను అందించారు. ఈ శిబిరాల్లో మొత్తం రూ.150 కోట్ల విలువైన రుణాలు మంజూరు చేసినట్లు బ్యాంకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

బిస్కెట్ల రూపంలో గంజాయి తరలింపు

● మహిళ అరెస్ట్



నిందితురాలు గీత

తిరుత్తణి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయిని బిస్కెట్ల రూపంలోకి మార్చి పోలీసు కళ్లుగప్పి విక్రయాలు చేపడుతున్న 42యేళ్ల మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. తిరువళ్లూరు జిల్లా అంబత్తూరు ఎస్టేట్ సమీపంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ మహిళను ఆపి ఆమె బ్యాగు తనిఖీ చేశారు. అందులో బిస్కెట్ల రూపంలోకి మార్చిన గంజాయి గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని ఆమెను మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణలో పట్టుబడిన మహిళ తిరువళ్లూరు జిల్లా అత్తిపట్టు ప్రాంతానికి చెందిన శుశాంత్‌కుమార్ భార్య గీతగా గుర్తించారు. ఈమె ఆంధ్రప్రదేశ్ నుండి గంజాయిని బిస్కెట్ల రూపంలో తరలించి యువతకు విక్రయించడానికి యత్నించినట్టు పోలీసులు తెలుసుకున్నారు. అనంతరం ఆమెదగ్గరున్న 2.2 కేజీల గంజాయి బిస్కెట్లు, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, అనంతరం కోర్టులో హాజరు పరిచి ఆమెను రిమాండ్‌కు తరలించారు.

నిరుపయోగంగా స్వయం సహాయక సంఘ భవనం



తిరుత్తణి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి పరిధిలోని చెరుక్కనూరు పంచాయతీలో శిథిలావస్థకు చేరుకున్న మహిళా స్వయం సహాయక సంఘ భవనాన్ని కూల్చివేసి నూతన భవనానికి రాష్ట్రప్రభుత్వం రూ.60లక్షలు కేటాయించింది. దీనికి సంబంధించిన పనులు 2022లో పూర్తయ్యాయి. గత మూడేళ్లగా కార్యాలయాన్ని ఉపయోగించకుండా అధికారులు తాళం వేశారు. దీంతో ఆ భవనం ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇదిలా వుండగా, నిరుపయోగంగా ఉన్న నూతన భవనం గదుల్లో సీలింగ్‌పై పెచ్చులు ఊడి పడుతున్నాయని, మరమ్మతులు చేసి కార్యాలయాన్ని తిరిగి ప్రారంభించాలని ఆ ప్రాంత మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, శుక్రవారం ఉదయం పట్టణాభివృద్ధిశాఖ అధికారి సంతానం కార్యాలయాన్ని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని ఆర్‌ఐసీటీ పాఠశాల, ఇండియన్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా రక్తదానం గురించి వైద్యుల బృందం, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు జనార్ధనన్ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. రక్త పరిశోధన కేంద్ర డైరెక్టర్ బాబు జనార్ధనన్, పాఠశాల డైరెక్టర్ అస్‌రఫ్, లాబ్ మేనేజర్ ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

● విశాల్ - లైకా కేసు....

విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హీరో విశాల్, నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ మధ్య కొనసాగుతున్న వివాదం కేసు విచారణ నుంచి న్యాయమూర్తి జయచంద్రన్ తప్పుకున్నారు. లైకా సంస్థకు విశాల్ రూ.21.30 కోట్ల రుణం చెల్లించాల్సి ఉంది. ఈ కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో గత కొంత కాలంగా సాగుతోంది. అయితే, ఈ కేసులో మొత్తం రుణానికి 30 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని న్యాయమూర్తులు జయచంద్రన్, ముమ్మినేనితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై హీరో విశాల్ అప్పీల్ చేశారు. దీంతో న్యాయమూర్తి జయచంద్రన్ తప్పుకున్నారు. ఈ కేసుపై విచారణ ఇప్పటికే పూర్తయిందని, ఈ కేసులో కొన్ని అభిప్రాయాలను వెల్లడించడం జరిగిందంటూ న్యాయమూర్తి జయచంద్రన్ విచారణ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. పైగా ఈ కేసును మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో ఈడీకి కోర్టు నోటీసు

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒక కేసులో తనకు మంజూరు చేసిన బెయిల్ నిబంధనలను సడలించాలని కోరుతూ డీఎంకే నేత, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ దాఖలు చేసిన పిటీషన్ విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు నోటీసులు పంపింది. డీఎంకేలో కీలక నేతగా ఉన్న సెంథిల్ బాలాజీపై మూడు అవినీతి కేసులున్నాయి. ఈ కేసుల్లో ఆయన కొన్ని నెలల పాటు జైలులో ఉండగా, సుప్రీంకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఉద్యోగం పేరుతో డబ్బులు వసూలు చేసిన కేసులో బెయిల్ నిబంధనలను సడలించాలని కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, న్యాయమూర్తులు సూర్యకాంత్, జాయ్‌మాల్యా బక్షిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి... వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబరు మొదటి వారానికి వాయిదా వేసింది.

తిరుచ్చి - చెన్నై బైపాస్ రోడ్డులో సొరంగ మార్గం కోసం ధర్నా

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సంజీవినగర్ వద్ద తిరుచ్చి - చెన్నై బైపాస్‌రోడ్డు దాటేందుకు సొరంగ మార్గం నిర్మించాలని కోరుతూ స్థానికులు శుక్రవారం ఉదయం రాస్తారోకో, ధర్నా జరిపారు. ఆ బైపాస్ రోడ్డులో నిర్విరామంగా వాహనాలు వెళుతుండటంతో సంజీవ్ నగర్ వాసులు రోడ్డు దాటేందుకు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడ సొరంగ మార్గాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ధర్నాకు దిగారు. ఈ ఆందోళన కారణంగా ఆ మార్గంలో గంటకు పైగా వాహనాల రాకపోకలు స్తంభించాయి.

చోరీ కేసులో పోలీసుల నిర్లక్ష్యం

● పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తుల ఆందోళన


తిరుత్తణి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి బయట కూర్చున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దొంగిలించిన గుర్తుతెలియని ఇద్దరు యువకులపై పెట్టిన కేసుపై పోలీసులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని మేట్టుపాళయంలో రోశమ్మాళ్ (85)అనే వృద్ధురాలు ఇంటి బయట కూర్చొని ఉన్న సమయంలో బైక్‌పై ఇద్దరు యువకులు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును దొంగిలించి పరారైయ్యారు. బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వృద్ధురాలి ఒంటిపై అంత విలువైన బంగారు నగ ఎందుకు పెట్టారని పోలీసులు ప్రశ్నించారు. దీంతో పోలీసుల నిర్లక్ష్య ధోరణిపై నిరసనగా గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ బయట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసి దొంగలను పట్టుకుంటామన్న హామీతో వారు అక్కడి నుండి వెనుదిరిగారు.

బాల్య వివాహాలను అరికట్టండి

● కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రజలకు పిలుపునిచ్చారు. వేలూరు పాతబస్టాండ్ వద్ద శుక్రవారం ఉదయం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కార్తికేయన్, వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎంకే మండల అధ్యక్షుడు నరేంద్రన్, డీఎంకే కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఆర్వో



డీఆర్వో శివసుబ్రమణ్యన్

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు డీఆర్వోగా శివసుబ్రమణ్యన్ నియమితులయ్యారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారి వేరే జిల్లాకు బదిలీ అవ్వగా డీఆర్వోగా శివసుబ్రమణ్యన్‌ను నియమిస్తూ రాష్ట్ర రెవెన్యూశాఖ ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఆయన వేలూరులోని రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు.

రైల్వేస్టేషన్లలో విస్తృత తనిఖీలు



కాట్పాడి స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ బాంబు పేలుడు ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, బస్టాండులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, వేలూరు జిల్లా కాట్పాడి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఉదయం పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఇందులో ఉత్తరాది రాష్ట్రాల యువకుల లగేజీ, పార్సిల్ విభాగంలో వస్తువులను తనిఖీ చేశారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులు, వేలూరులోని గాంధీరోడ్డు, మెయిన్‌బజార్, సైదాపేట, తోటపాళయం తదితర ప్రాంతాల్లో కూడా తనిఖీలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్రాందీ ప్యాకెట్లను తరలించిన ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

వేలూరు, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి చెందిన బ్రాందీ ప్యాకెట్లను వేలూరుకు తరలించిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వేలూరు జిల్లా పేర్నాంబట్టు సమీపంలోని కొండప్రాంతాల నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన బ్రాందీ ప్యాకెట్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో, గురువారం రాత్రి వేగంగా వస్తున్న ఓ కారు ఆపి తనిఖీ చేయగా, అందులో 567 బ్రాందీ ప్యాకెట్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కారు ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. అనైకట్టుకు చెందిన దీపన్‌రాజ్, వసంత్‌రాజ్, ఉమేష్‌లుగా పోలీసులు గుర్తించి, కోర్టులో హాజరుపరిచిన అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

తిరుత్తణిలో దేవాదాయశాఖ కమిషనర్ పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ రవిచంద్రన్

తిరుత్తణి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఉదయం హిందూ దేవాదాయశాఖ కమిషనర్ రవిచంద్రన్ పరిశీలించారు. దేవాదాయ శాఖ రూ.86 కోట్లతో చేపట్టిన రాజగోపురం నిర్మాణం పనులను పరిశీలించారు. పనుల సకాలంలో పూర్తిచేయాలని ఇంజనీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వివేకానంద శుక్లా, చీఫ్ ఇంజనీర్ పెరుమాళ్, ఆలయ కమిషనర్ రమణి, ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా 'వాక్ ఫర్ చిల్డ్రన్'

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రాష్ట్ర శిశు సంరక్షణశాఖ అధికారుల ఆధ్వర్యంలో 'వాక్ ఫర్ చిల్డ్రెన్' ప్రత్యేక ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కార్తికేయన్ అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి ప్రారంభమై 2 కిలోమీటర్ల మేర కొనసాగింది. ఈ కార్యక్రమంలో వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, పాల్గొన్న విద్యార్థులు



డీఆర్ఏ హోమ్స్ నుంచి ఈఎస్ఓపీ



ఉద్యోగులతో రంజిత్ రాథోడ్

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలో తొలిసారిగా డీఆర్ఏ హోమ్స్ రూ.125 కోట్ల మేర 'ఎంప్లాయీ స్టాక్ ఓనర్షిప్ ప్లాన్' (ఈఎస్ఓపీ)ను ప్రకటించింది. సంస్థలో డ్రైవర్ల నుంచి డిపార్ట్‌మెంట్ హెడ్‌ల వరకు మొత్తం 325 మందికి యాజమాన్యాన్ని విస్తరించింది. దీని గురించి సంస్థ ఎండీ రంజిత్ రాథోడ్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యోగుల యాజమాన్యం, సమానమైన రివార్డ్ వ్యవస్థలు, గుర్తింపు సంస్కృతిని కలపడం ద్వారా రియల్ ఎస్టేట్‌లో కార్పొరేట్ నాయకత్వం అంటే ఏమిటో పునర్నిర్వచించుకుంటోందని తెలిపారు.

● కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం..

చికిత్స ఫలించక మహిళ మృతి

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ, ఆస్పత్రిలో చికిత్స ఫలించక మృతిచెందింది. తిరువణ్ణామలై జిల్లా కీలతామరై గ్రామానికి చెందిన రైతు కుమార్ (40)కు పూంగొడి (38) అనే భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్‌కు అతని బంధువులకు ఓ స్థలం విషయమై దీర్ఘకాలంగా ఘర్షణ జరుగుతోంది. అదే సమయంలో, కుమార్ స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు వారు యత్నిస్తున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం స్థలం వ్యవహారంలో కుమార్, పూంగొడిపై ప్రత్యర్థులు దాడిచేసినట్లు సమాచారం. ఈ విషయం కలెక్టర్‌కు ఫిర్యాదుచేసేందుకు కుమార్, పూంగొడి వచ్చారు. కుమార్ హఠాత్తుగా పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. పెట్రోల్ పూంగోడిపై పడడంతో ఆమె కూడా మంటల్లో చిక్కుకుంది. చుట్టుపక్కల వారు మంటలు ఆర్పి వారిని తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం చెన్నై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక గురువారం ఉదయం పూంగొడి మృతిచెందగా, కుమార్‌కు చికిత్స అందిస్తున్నారు.

పరువు హత్యల నిరోధానికి ప్రత్యేక చట్టం

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరువు హత్యల నిరోధానికి ప్రత్యేక చట్టం రూపొందించేందుకు న్యాయమూర్తి కేఎన్ బాషా నేతృత్వంలో సిఫార్సుల కమిటీని నియమించాల్సిందిగా రాష్ట్ర హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్ జీవో విడుదల చేశారు. అక్టోబరు 17న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పరువుహత్యల నిరోధానికి వీలుగా రాజకీయ పార్టీలు, న్యాయ నిపుణులు, సంఘ సేవకులు, బాధితులు, ప్రజల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బాషా నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. దీనిని అమలుపరిచే విధంగా ఏర్పాటైన ప్రత్యేక కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వి.పళనికుమార్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రామనాథన్‌లను సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కమిటీ సమన్వయంగా ప్రజల అభిప్రాయాలను సేకరించి మరో మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

● విద్యా నిర్బంధ హక్కు చట్టం..

30లోగా జాబితా సమర్పించండి: హైకోర్టు

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యా నిర్బంధ హక్కు చట్టం కింద 20 శాతం సీట్లలో పేద కుటుంబాల విద్యార్థులకు కేటాయించిన జాబితాను ఈ నెల 30వ తేదీలోగా రాష్ట్రప్రభుత్వానికి సమర్పించేందుకు మద్రాస్ హైకోర్టు తుది అవకాశం కల్పించింది. రాష్ట్రంలో విద్యా నిర్బంధ హక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లలో పేద విద్యార్థులను చేర్చుకోవాలి. అడ్మిషన్ల వివరాలను అక్టోబర్ 18వ తేదీలోగా సంబంధిత పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సమక్షంలో హాజరైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల తరుపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. దీంతో పేద విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియను అక్టోబరు 31 వరకు న్యాయస్థానం పొడిగించింది. అయితే ఈ ఉత్తర్వులను కూడా వ్యతిరేకించిన ప్రైవేటు పాఠశాలల యజమాన్యం అప్పీలుకు వెళ్లింది. ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తుల బెంచ్ జస్టిస్ ఆర్.సురేష్‌కుమార్, హేమంత్ చందన్ గౌడర్ ముందు గురువారం విచారణకు వచ్చింది. ఇరు తరుపు వాదనలు విన్న అనంతరం పేద విద్యార్థుల అడ్మిషన్ల జాబితాను ఈ నెల 30వ తేదీలోపు ప్రభుత్వానికి సమర్పించే అవకాశం కల్పిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

న్యాయాధికారిపై చెప్పు విసిరేందుకు రౌడీ యత్నం

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌పై పెట్రోల్ బాంబు దాడి కేసులో తనకు పదేళ్ల జైలు శిక్ష విధించారన్న కోపంతో ఓ వ్యక్తి న్యాయాధికారిపై చెప్పు విసిరేందుకు యత్నించాడు. అయితే గమనించిన పోలీసులు అతడిని అడ్డుకున్నారు. వివరాలిలా వున్నాయి... రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించే బిల్లులను ఆమోదించకుండా అడ్డుకుంటున్నారన్న కోపంతో కరుక్కా వినోద్ (42) అనే రౌడీ 2023లో రాజ్‌భవన్‌పె పెట్రోల్ బాంబులు విసిరాడు. ఈ కేసుపై విచారణ జరిపిన పూందమల్లిలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు న్యాయాధికారి మలర్‌విళి బుధవారం వినోద్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించారు. నిజానికి గతంలో ఓ కేసు విచారణ సందర్భంగా వినోద్ సదరు న్యాయాధికారితో వాగ్వివాదం చేస్తూ చెప్పు విసిరాడు. దీంతో పరిస్థితి గ్రహించిన జడ్జి.. రాజ్‌భవన్‌పై పెట్రోల్ బాంబుల కేసు విచారణను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి తీర్పు వెలువరించారు. అయితే ఓ మద్యం దుకాణంపై పెట్రోల్ బాంబు విసిరిన కేసు విచారణ మాత్రం న్యాయాధికారి గురువారం ప్రత్యక్షంగా నిర్వహించారు. ఈ కేసులో నిందితుడైన వినోద్‌ను పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు. విచారణ జరుగుతుండగానే వినోద్.. రాజ్‌భవన్‌పై బాంబులు విసిరిన కేసులో పదేళ్ల జైలుశిక్ష ఎలా విధిస్తారని కేకలేస్తూ చెప్పు విసిరేందుకు ప్రయత్నించాడు. అయితే పోలీసులు అడ్డుకుని, అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఇకపై ఆ నిందితుడిపై వున్న కేసులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టాలని సదరు న్యాయాధికారి నిర్ణయించారు.

చెక్ బౌన్స్ కేసులో వైద్యుడికి ఏడాది జైలు

అడయార్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో వైద్యుడిని కోర్టు ఏడాది జైలుశిక్ష విధించింది. కడలూరు జిల్లా సెమ్మేడు గ్రామానికి చెందిన న్యాయవాది పార్థసారథి వద్ద కడలూరు సెమ్మండలం ధనలక్ష్మి నగర్‌కు చెందిన ప్రభుత్వ సిద్ధ వైద్యుడు డా.సెంథిల్ కుమార్ 2021లో రూ.20 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చేలా సెంథిల్ కుమార్ చెక్ అందించాడు. వైద్యుడు చెప్పిన తేదీకి చెక్ బ్యాంక్‌లో వేయగా, ఖాతాలో డబ్బు లేదని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై సెంథిల్‌కుమార్‌పై పార్థసారథి బన్రూటి కోర్టులో చెక్ బౌన్స్ పిటిషన్ దాఖలుచేశాడు. బన్రూటి క్రిమినల్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో.. సెంథిల్‌కుమార్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి మార్సల్ ఏసువదన్ తీర్పునిచ్చారు. అలాగే, పార్థసారధికి ఇవ్వాల్సిన రూ.20 లక్షలు 5.20 శాతం వడ్డీతో కలిపి రూ.25.20 లక్షలు నెలరోజుల్లో చెల్లించాలని సెంథిల్‌కుమార్‌ను న్యాయమూర్తి ఆదేశించారు.

మియన్మార్ తిరుగుబాటు దళంలో 35 మంది తమిళులకు విముక్తి

● నలుగురు ఏజెంట్ల అరెస్టు

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌లో ఐటీ ఉద్యోగాలు వేయిస్తామని చెప్పి తంజావూరు, తిరువారూరు, కడలూరు తదితర జిల్లాలకు చెందిన 35 మందిని మియన్మార్ తిరుగుబాటు దళంలో చేర్చిన నలుగురు ఏజెంట్లను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మియన్మార్ రాయబార కార్యాలయ అధికారుల ద్వారా తీసుకున్న చర్యల కారణంగా ఆ 35 మంది తమిళులను తిరుగుబాటు దళం నుండి విముక్తి కలిగించి స్వదేశానికి తరలించే ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 6 నుండి 10 వరకు వారిని రెండు బృందాలుగా స్వదేశానికి తీసుకువచ్చారు. ఈ మోసానికి పాల్పడిన ఏజెంట్లు రాజ్‌కుమార్ (36), మణవాళన్ (35), దీపక్ (27), అభిషేక్ రాజన్ (28) అనే నలుగురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు.

అరుల్‌నిధి - మమత జంటగా 'మై డియర్ సిస్టర్'


'మై డియర్ సిస్టర్'లో అరుల్‌నిధి - మమత మోహన్‌దాస్

'ఎన్నంగ సర్ ఉంగ చట్టం' అనే చిత్రంతో ప్రశంసలు పొందిన దర్శకుడు ప్రభు జయరాం తాజాగా హీరో అరుల్ నిధి, హీరోయిన్ మమత మోహన్‌దాస్ ప్రధాన పాత్రల్లో 'మై డియర్ సిస్టర్' పేరుతో ఓ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో అరుల్‌నిధి, మమత మోహన్ దాస్ అక్కాతమ్ముళ్లుగా నటించారు. ఫ్యాషన్ స్టూడియోస్, గోల్డ్ మైన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. తమిళం, తెలుగు, మలయాళం భాషల్లో రూపొందిన ఈ మూవీ ప్రోమోను ఇటీవల విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. ఇతర పాత్రల్లో సీనియర్ నటుడు అరుణ్ పాండియన్, మీనాక్షి గోవిందరాజ్ తదితరులు నటించగా, సుధన్ సుదర్శన్, మనీష్ షా నిర్మించారు.

ప్రతి చిత్రం మొదటి సినిమా వంటిదే

● యాక్షన్ కింగ్ అర్జున్ ● 21న 'తీయవర్ కులై నడుంగ' విడుదల


చిత్రజ్యోతి


ఆడియో రిలీజ్ కార్యక్రమంలో చిత్ర బృందం

తాను నటించే ప్రతి సినిమా తనకు మొదటి చిత్రమేనని సీనియర్ నటుడు, యాక్షన్ కింగ్ అర్జున్ అన్నారు. జీఎస్ ఆర్ట్స్ పతాకంపై అర్జున్ - ఐశ్వర్య జంటగా నూతన దర్శకుడు దినేష్ లక్ష్మణన్ రూపొందించిన చిత్రం 'తీయవర్ కులై నడుంగ'. జి.అరుల్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21వ తేదీన విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి నగరంలో చిత్రం ఆడియో, ట్రైలర్‌ను పలువురు ప్రముఖుల సమక్షంలో రిలీజ్ చేశారు. ఇందులో అర్జున్ మాట్లాడుతూ, 'ఇది నాకు చాలా ముఖ్యమైన చిత్రం. ప్రతి చిత్రం నాకు మొదటి సినిమా వంటిది. సినిమాపై ఉన్న అమితమైన ప్రేమే అరుణ్‌కుమార్‌ను నిర్మాతగా మార్చింది. నేను చాలా మంది కొత్త దర్శకులతో పనిచేశాను. కానీ దినేష్ లక్ష్మణన్ ప్రత్యేకమైన వ్యక్తి. ఐశ్వర్య రాజేష్ మంచి నటి. ఆమె తండ్రి నాకు మంచి స్నేహితుడు. అతడితో కలిసి ఐదారు చిత్రాల్లో నటించాను. ఈ సినిమా అందరి ఆశీస్సులు, ప్రేమను పొందాలని కోరారు. నటి ఐశ్వర్య మాట్లాడుతూ, 'దర్శకుడు ఈ కథ వివరిస్తున్నపుడు నాలోని ప్రతి అణువు వణికిపోయింది. ఒక నిజమైన స్టోరీ చెబుతుంటే ప్రజలు కూడా బాగా కనెక్ట్ అవుతారు. కమర్షియల్ సినిమా ప్రపంచంలో ఇలాంటి ఒక వాస్తవ కథను ప్రేక్షకులకు చెప్పాలని దర్శకుడు భావించడం పెద్ద సాహసం. యాక్షన్ కింగ్ అర్జున్ నిజ జీవితంలో జెంటిల్‌మేన్. ఆయన మాయాజాలాన్ని ప్రత్యక్షంగా చూసి ఆశ్చర్యపోయాను' అన్నారు. చిత్ర దర్శకుడు దినేష్ మాట్లాడుతూ, 'నా 15 యేళ్ళ దాహమే ఈ సినిమా. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నాలో సినిమా కోరికను ప్రేరేపించిన వ్యక్తి మా నాన్న. నిర్మాత అరుల్ కుమార్‌కు సినిమా అంటే పిచ్చి. ఆయన తీసిన రెండు చిత్రాలు నిరాశపరిచాయి. కానీ, నాకు ఇచ్చిన మాట కోసం ఈ సినిమా నిర్మించారు. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు.

ప్రేక్షకులను మోసం చేయలేం

● నటి పార్వతి



నేటి కాలంలో ప్రేక్షకులను మోసం చేయలేమని హీరోయిన్ పార్వతి అన్నారు. తమిళంలో 'పూ', 'మరియాన్', 'ఉత్తమవిలన్', 'తంగలాన్' వంటి చిత్రాల్లో నటించి కోలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైన ఈ మలయాళ భామ ఇపుడు దక్షిణాది భాషల్లో నటిస్తూ బిజీగా మారిపోయింది. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో 'ఇపుడు ప్రేక్షకులు భాష గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. వారు వాస్తవిక కథలను మాత్రమే ఇష్టపడుతున్నారు. ఈ మార్పు చాలా మంచిది. ఎందుకంటే ఇది మనల్ని మరింతగా కష్టపడి పనిచేయడానికి, సినిమా పట్ల నిజాయితీగా ఉండటానికి ప్రేరేపిస్తుంది. గతంలో హిందీ సినిమా దక్షిణ భారత సినిమా వంటిది కాదని భావించాను. ఎపుడూ రొటీన్ కథలతో సినిమాలు తీసేవారు. ఇపుడు వారు కూడా మారారు. నేడు హిందీ సినిమాల్లో కథలు చెప్పే విధానం కూడా పూర్తిగా మారిపోయింది. వాస్తవిక కథలతో సినిమాలు వస్తున్నాయి. ఓటీటీలు వచ్చిన తర్వాత దక్షిణాది సినిమా ప్రపంచం మరింతగా విస్తరించింది. అని పేర్కొన్నారు.

'మనుషి' వివాదం పరిష్కారం

● వెట్రిమారన్



గోపి నాయర్ దర్శకత్వంలో ఆండ్రియా ప్రధాన పాత్ర పోషించిన 'మనుషి' చిత్ర సెన్సార్ వివాదం పరిష్కారమైందని ఆ చిత్ర నిర్మాత వెట్రిమారన్ వెల్లడించారు. ఈ సినిమాలో అనేక అభ్యంతరకర, వివాదాస్పద సన్నివేశాలుండటంతో విడుదలకు సెన్సార్ బోర్డు బ్రేక్ వేసింది. దీంతో నిర్మాత వెట్రిమారన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, ఈ చిత్రాన్ని న్యాయమూర్తి స్వయంగా వీక్షించారు. ఈ విషయంపై వెట్రిమారన్ మాట్లాడుతూ, "మనుషి' సినిమా సెన్సార్ వివాదం పరిష్కారమైంది. భారతీయ సినిమా చరిత్రలో ఒక న్యాయమూర్తి స్వయంగా థియేటర్‌కు వచ్చి సినిమా చూశారు. ఆయనతో పాటు సెన్సార్, చిత్ర బృందం సభ్యులు కూడా ఉన్నారు. సినిమా చూశాక ఇరువర్గాల అభిప్రాయాలను న్యాయమూర్తి సేకరించారు. ఇలా జరగడం చాలా అరుదు. తొలుత సినిమాలో 32 చోట్ల సన్నివేశాలను తొలగించాలని సెన్సార్ సభ్యులు కోరగా, న్యాయమూర్తి సినిమా చూసిన తర్వాత 12 చోట్ల సన్నివేశాలను తొలగించాలని సిఫార్సు చేశారు. చివరకు మా చిత్రానికి 'యూఏ 6+' సర్టిఫికెట్ మంజూరైంది. 'మాస్క్' సినిమా విడుదల పనులన్నీ పూర్తయిన తర్వాత 'మనుషి' సినిమ విడుదల తేదీని ఖరారు చేసి ప్రమోషన్ పనులను ప్రారంభిస్తాం' అని పేర్కొన్నారు.




తరుణి

నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ఉనికిని చాటుకుంటున్నారు. ఆ రీతిలో టీవీ కార్యక్రమాల వ్యాఖ్యాతగా జీవితాన్ని ప్రారంభించి ఓ సంస్థ వ్యవస్థాపకురాలిగా ఎదిగిన విష్ణుప్రియ నేడు ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగంలో విజయ పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ప్రతి సారీ కొత్త కొత్త పద్ధతులను పరిచయం చేస్తూ వైవిధ్య భరితమైన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించే విష్ణుప్రియ తన ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ గురించి 'తరుణి'తో పంచుకున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

ఈవెంట్స్ రంగంలో వినూత్నం..



ఉన్నత శిఖరాల అధిరోహణం

● 'అరోరా' వ్యవస్థాపకురాలు విష్ణుప్రియ

ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లు...

ప్రతి బిజినెస్‌లోనూ సవాళ్లు ఉంటాయి. కానీ చాలా మంది సెలబ్రిటీలు బహిరంగంగా పాల్గొనే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం కఠినమైనంగా ఉంటుంది. ఏదైనా కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయడం పెద్ద సవాలు. సమయపాలన చాలా ముఖ్యం అతిథులు రాకపోయినా, వారు ఆలస్యంగా వచ్చినా ఆ ప్రోగ్రామ్‌కు హాజరమైనవారిని సంతోషపెట్టేలా ఈవెంట్ విజయవంతం చేయాలి. ప్రతి ఈవెంట్‌కు సన్నాహాలు ప్రారంభించినప్పటి నుండి ఆ ఈవెంట్ జరిగే రోజు వరకు టెన్షన్‌తోనే ఉంటాం. అదే సమయంలో అనుకున్నట్లే ప్రోగ్రామ్ సక్సెస్ అయితే, అందరి ప్రశంసలు లభిస్తే కలిగే ఆనందంతో ఆ కష్టాలను మరచిపోతామని విష్ణుప్రియ తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు.

నా గురించి...

ఎంబీఏ చదివిన నేను కాలేజీ డేస్ నుంచే ప్రైవేట్ టీవీ ఛానెళ్లలో ప్రెజంటర్‌గా పనిచేసాను. ఎంబీఏ తర్వాత కార్పొరేట్ కంపెనీలో పనిచేశాను. ఆ కంపెనీలో పలు కార్యక్రమాలు నిర్వహించే బాధ్యతలు నాకప్పగించారు. ఇలాంటి ఈవెట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ చేసే కంపెనీ సొంతంగా ప్రారంభిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కలిగింది. తదుపరి వెంచర్‌గా నా స్వంత ఈవెంట్ మేనేజ్‌మెంట్ బిజినెస్ ప్రారంభించాను. మీడియా, సినీ పరిశ్రమలో ఉన్న స్నేహితులతో పరిచయాలు, సంబంధాలే నన్ను విజయవంతమైన ఈవెంట్ మేనేజర్‌గా మార్చిందని చెప్పవచ్చు. నా కంపెనీ అరోరా విజయం కూడా నా అచంచలమైన అభిరుచి, కృషి ఫలితమే. ఈ బిజినెస్‌లో 16 యేళ్ల అనుభవం సంపాదించాను. ఆ అనుభవంలో అనేక కార్యక్రమాలు జరిపి ఎంతో మంది వీవీఐపీల ప్రశంసలు కూడా అందుకున్నాను.

ఎలాంటి ప్రోగ్రామ్స్ జరుపుతారు?

బర్త్‌డే పార్టీలు, న్యూఇయర్ సెలిబ్రేషన్స్, మ్యూజిక్ పార్టీలు ఇలా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. చాలా మంది వీఐపీలు అతిథులుగా పాల్గొంటారు కాబట్టి చాలా స్పెషల్ ఐటమ్స్ చేయాల్సి ఉంటుంది. అనేకమంది రాజకీయ ప్రముఖులు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు వారి కోరిక మేరకు ప్రైవేటు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంటాము. మా సంస్థ నిర్వహించే కార్యక్రమాలన్నీ ఆసక్తికరంగా ఉంటాయి. పాల్గొన్న వారికి బోర్ కొట్టకుండా పోటీలు నిర్వహించి వారికి ప్రత్యేక బహుమతులు కూడా అందిస్తుంటాం.

స్పెషల్‌గా భావించే ప్రోగ్రామ్స్...

మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసి వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. మహిళా దినోత్సవం రోజున 'గోల్డెన్ డాటర్' కార్యక్రమాన్ని నిర్వహించి, వందమందికి పైగా మహిళలను సత్కరించాం. ఆ తర్వాత అనేకమంది విజయాలకు కారణమైన గురువులను, శిష్యులను గౌరవించేలా 'గురు శిష్య' పేరుతో ఈవెంట్ జరిపాం. ప్రతి కార్యక్రమానికి వచ్చే వారిని సంతోషపెట్టడమే మా లక్ష్యం. ఓ ప్రోగ్రామ్‌లో హాస్యనటులతో కామెడీ షో ద్వారా అందరినీ ఆకట్టుకున్నాం. ఈవెంట్ మేనేజ్‌మెంట్ బిజినెస్‌లో లభించే వ్యాపార సంబంధాలను నిలబెట్టకోవడం, అందరితోనూ సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం, కొత్త పరిచయాలను ఏర్పరచుకోవడం, అద్భుతమైన స్పీకింగ్ నైపుణ్యం, వేదికను సమర్థవంతంగా చేపట్టగల సామర్థ్యం, ఏ వాతావరణంలోనైనా ఈవెంట్స్ జరిపేందుకు వనరులతో కూడిన వ్యూహాలు, క్లిష్టపరిస్థితులను ఎదుర్కోగల సామర్థ్యం, మన వద్దకు వచ్చే వీఐపీలు, సెలబ్రిటీలతో సౌమ్యంగా వ్యవహరించడం వంటి సుగుణాలు ఉంటే ఈవెంట్ మేనేజ్‌మెంట్ బిజినెస్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని చెబుతున్నాను.


సింపుల్ పార్టీ అలంకరణ

అన్నానగర్‌లో 'కుక్‌గ్రామం' పునఃప్రారంభం


కుక్‌గ్రామం పునఃప్రారంభోత్సవం

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తమిళ గ్రామీణ సేంద్రియ ఆహారం అందించే 'కుక్‌గ్రామం' పునఃప్రారంభమైంది. ఆరోగ్య హెల్త్‌కేర్ సంస్థకు చెందిన సిద్ధ వైద్యాధిపతి డాక్టర్ జి.శివరామన్ శుక్రవారం దీనిని ప్రారంభించారు. దేవి ఉమాపతి 2014లో స్థాపించిన ఈ కుక్‌గ్రామం పేరుకు తగ్గట్టుగానే వెదురుతో నిర్మించారు. వందేళ్ల నాటి చెట్టినాడ్ శైలి కిటికీలు, జలపాతాలతో ప్రాంగణం నిజంగానే కుగ్రామాన్ని తలపిస్తోంది. ఇక్కడ తూయమల్లి, కిచిలి సాంబా, మాప్పిళ్లై సాంబా, సీరగ సాంబా, మరుంగురవై వంటి స్వదేశీ బియ్యంతో తయారు చేసే సేంద్రియ శాఖాహార వంటకాలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా దేవి ఉమాపతి మాట్లాడుతూ.. తమిళ కుగ్రామం ఆత్మను తీసుకొచ్చి వినియోగదారుల ముందుంచుతున్నామన్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ కుక్‌గ్రామం అందుబాటులో వుంటుంది.

ఘనంగా 'బెస్ట్ ఆఫ్ బెస్ట్' అవార్డుల ప్రదానం


అవార్డు గ్రహీతలతో ఎంపీ తమిళచ్చి తంగపాండియన్

ప్యారీస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీడబ్ల్యూఐ ఆధ్వర్యంలో పదేళ్ల డ్రైవింగ్ వర్క్‌ప్లేస్ ఇన్‌క్లూజన్ గుర్తుచేసే విధంగా ఉత్తమ సేవలకు గాను బెస్ట్ ఆఫ్ బెస్ట్ అవార్డుల ప్రదానోత్సవం నగరంలో గురువారం రాత్రి జరిగింది. డీఎంకే పార్లమెంట్ సభ్యురాలు తమిళచ్చి తంగపాండియన్ ముఖ్యఅతిథిగా హాజరై అవతార్ అండ్ సెరామౌంట్ బెస్ట్ కంపెనీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా, మోస్ట్ ఇన్‌క్లూజన్ కంపెనీ ఇండెక్స్, బెస్ట్ కంపెనీస్ ఫర్ ఈఎస్‌జీ కేటగిరిల్లో ఎంపికైన విజేతలకు జ్ఞాపిక, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌందర్యా రాజేష్, శుభాబరియా, పూజ తదితర నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా కృపానంద వారియర్ గురుపూజోత్సవం


సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక గురువు, మురుగన్ భక్తుడైన కృపానంద వారియర్ గురుపూజోత్సవం వేలూరు జిల్లా గంగేయనల్లూరులోవున్న కృపానంద వారియర్ జ్ఞానపీఠంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేలూరు జిల్లా మహాజన సంఘం అధ్యక్షుడు కేవీ.సెల్వరాజ్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన గురుపూజోత్సవంలో స్థానిక భక్తులు పాల్గొని కృపానంద వారియర్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ఆధ్యాత్మిక సంఘాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మధుమేహ బాధితులకు నేత్రపరీక్ష తప్పనిసరి

● అగర్వాల్ ఐ హాస్పిటల్ రీజనల్ హెడ్ డాక్టర్ సౌందరి


మధుమేహబాధితులకు కంటిపరీక్షలు జరుపుతున్న డాక్టర్ సౌందరి

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనియంత్రిత మధుమేహం వల్ల కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని, ముందస్తు నేత్ర పరీక్షలు జరుపుకుంటే ఈ ముప్పు తప్పించవచ్చునని డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ సౌందరి అన్నారు. ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా శుక్రవారం ఉదయం ఆస్పత్రి ఆధ్వర్యంలో డయాబెటిక్ రెటినోపతి సదస్సు నిర్వహించారు. చెన్నై, బెంగళూరు, ముంబాయి, కోల్‌కత్తా, హైదరాబాద్, చండీఘడ్, శ్రీనగర్, త్రివేండ్రం నగరాల్లో ఈ సదస్సు ఒకే సమయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్‌లో మధుమేహ బాధితులకు ఈ నెల 30 వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ సౌందరి తెలిపారు. తక్కినవారికి కన్సల్టేషన్ ఫీజులో 50శాతం రాయతీ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు 95949 24048 అనే నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె వివరించారు. ఆ హాస్పిటల్ చీఫ్ క్లినికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్ సదస్సులో ప్రసంగించారు.


శివగంగ జిల్లా కారైక్కుడి అళగప్పా ఆదర్శ మహోన్నత పాఠశాలలో పాఠశాలల విద్యాశాఖ, బీసీలు, ఓబీసీలు, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన సభలో 11వ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పరాశక్తి అమ్మవారి రథానికి రూ.72లక్షలతో మరమ్మతులు

● ప్రయోగాత్మక రథోత్సవానికి పోటెత్తిన భక్తులు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో రూ.72 లక్షలతో మరమ్మతులు పూర్తి చేసుకుని, కొత్త అందాలను సంతరించుకున్న పరాశక్తి అమ్మవారి రథానికి శుక్రవారం ట్రయల్ రన్‌నిర్వహించారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తీక దీప మహోత్సవాలు ఈ నెల 21 నుంచి డిసెంబర్ 7 వరకు జరుగనున్నాయి. ఆ వేడుకలలో ఏడో రోజైన 30వ తేదీ పంచమూర్తుల రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆ ప్రకారం ఆ రోజు ఉదయం వినాయకుడి రథోత్సవం జరుగుతుంది. ఆ తర్వాత మురుగన్ రథం, ఉన్నాములై అమ్మవారు సమేత అరుణాచలేశ్వరుడి రథం, దాని వెనుకే పరాశక్తి అమ్మవారి రథం, చండికేశ్వరుడి రథం ఇలా నాలుగు రథాలు వరుసగా వెళతాయి. ఈ పంచమూర్తుల రథాల్లో ఒకటైన పరాశక్తి అమ్మవారి రథం చక్రాలు తదితర విభాగాలు దెబ్బతినటంతో రూ.72 లక్షలతో కొత్త చక్రాలు నిర్మించారు. అన్ని మరమ్మతులు పూర్తికావటంతో ఆ రథం పటిష్ఠత పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం రథోత్సవం జరిపారు.

ఎస్‌ఆర్‌ఎం గ్లోబల్ హాస్పిటల్‌లో ఇరాక్ వృద్ధుడికి మూత్రాశయ చికిత్స


చికిత్స అనంతరం కోలుకున్న వృద్ధుడితో వైద్యనిపుణులు, సిబ్బంది

చెన్నై, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాట్టాన్ కొళత్తూరులోని ఎస్‌ఆర్‌ఎం గ్లోబల్ హాస్పిటల్‌లో ఇరాక్‌కు చెందిన 74 యేళ్ళ వృద్ధుడికి మూత్రాశయ సంబంధిత శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు ఆ ఆస్పత్రి వైద్యనిపుణుడు డాక్టర్ ఆనంద్ కృష్ణమూర్తి తెలిపారు. మూత్రాశయం పరిమాణం విపరీతంగా పెరగటంతో మూత్ర విసర్జన కూడా చేయలేని పరిస్థితిలో తమ ఆసుపత్రిలో చేరి సకాలంలో చికిత్స అందుకున్నాడన్నారు. తన పర్యవేక్షణలో జరిగిన ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ ఎం.దీపక్, డాక్టర్ వరుణ్ సి.డాక్టర్ టీఆర్ మురళీధరన్ సహాయ సహకారాలు అందించినట్లు ఆయన వివరించారు.


నెహ్రూ జయంతి సందర్భంగా చెన్నై గిండి కత్తిపారా జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో పూలమాల వేసి, చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సుబ్రమణ్యం, ఎంపీ టీఆర్ బాలు, శాసన సభ్యుడు జేఎం హసన్‌మౌలానా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు


చెన్నై పెరియమేడు వద్ద రూ.3.86 కోట్లతో నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



అవార్డు గెలుచుకున్న అమరరాజ బృందం సభ్యులు

13 గోల్డ్ అవార్డులు గెలుచుకున్న 'అమరరాజ'

రేణిగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లోని తైపీ నగరంలో జరిగిన 50 వ అంతర్జాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ కన్వెన్షన్ ఐసిక్యూసిసి- 2025లో అమరరాజ తరపున పాల్గొన్న 13 బృందాలు 13 గోల్డ్ అవార్డులు గెలుచుకున్నాయి. 14 దేశాలు నుంచి 884 బృందాలు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అమరరాజ తరపున 13 బృందాలు గోల్డ్ అవార్డును సాధించాయి. అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ ఈఎంయాల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై అమరరాజ సాధించిన ఈ గౌరవం అమర రాజా పరిశ్రమలో తయారయ్యే పరికరాల నాణ్యతకు గుర్తింపు అని పేర్కొన్నారు. 13 బంగారు అవార్డులు గెలుచుకున్న బృందాలకు అమరరాజ చైర్మన్ గల్లా జయదేవ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,129

తలనీలాలు సమర్పించినవారు: 21,026



◆ కూటమి పాలనలో

పంచాయతీ ఖజానా గలగల

✳ వైసీపీ హయాంలో భవనాలకు అవినీతి కొలతలు ✳ భారీగా తగ్గిన ఆస్తి పన్ను రాబడి

✳ కూటమి ప్రభుత్వంలో రీ వెరిఫికేషన్‌తో వెలుగులోకి ✳ గతేడాదితో పోలిస్తే పెరిగిన రూ.10 కోట్లు

● తిరుచానూరు సమీపంలో ఓ స్టార్ హోటల్ 35వేల చదరపు అడుగుల్లో ఉంది. రికార్డుల్లో మాత్రం 8వేల చదరపు అడుగులు మాత్రమే చూపించారు. రూ.4.23లక్షల పన్ను కట్టించుకున్నారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలమేరకు పంచాయతీ అధికారులు ఇటీవల అదే హోటల్ భవన విస్తీర్ణాన్ని రీవెరిఫికేషన్‌చేస్తే 35వేల చదరపు అడుగుల్లో ఉన్నట్లు తేలింది. దీంతో రూ.9.71లక్షలు ప్రాపర్టీ ట్యాక్సు కట్టించారు. అంటే రూ.5 లక్షలకు పైగా పంచాయతీకి ఆదాయం వచ్చింది.

● ఏర్పేడు వద్ద ఓ ఇండస్ట్రీకి రూ.2.49 లక్షలు మాత్రమే ప్రాపర్టీ ట్యాక్సు కట్టించుకున్నారు. తీరా రీవెరికేషన్‌లో అదే పరిశ్రమ రూ.4.77 లక్షలు చెల్లించింది. ● గూడూరు వద్ద ఓ ప్రైవేటు పరిశ్రమ రూ.3.45 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.1.02 లక్షలే కట్టించుకున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిధిలోని భవనాల కొలతల్లో స్థానిక నేతలతో కలిసి కొందరు సిబ్బంది చేతివాటం చూపారు. దీనివల్ల పంచాయతీలకు ఆస్తి పన్ను రాబడి గణనీయంగా తగ్గింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో ఆస్తి పన్ను వివరాలను ఆయా పంచాయతీల్లో ఆన్‌లైన్ చేశారు. ఆస్తి పన్నుతోపాటు వివిధ పన్నులను వరికి వారే చెల్లించుకునే సదుపాయం కల్పించారు. దీనికి తోడు ఆయా గ్రామ పంచాయతీల్లోని వాణిజ్యభవనాల (ప్రైవేట్ హోటల్స్, ఇండస్ట్రీస్, ఆస్పత్రులు) కొలతలు రీవెరిఫికేషన్ చేశారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో తక్కువ కొలతలు చూపారన్న విషయం వెలుగు చూసింది. తద్వారా దాదాపు రూ.10కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి పడిన విషయం బయటకు వచ్చింది. ఇలా తొట్టంబేడు, తిరుపతి రూరల్, వరదయ్యపాలెం తదితర మండలాల్లో మొత్తం వాణిజ్య భవనాలు, ఇళ్ల కొలతలు రీవెరిఫికేషన్ చేయగా దాదాపు రూ.10కోట్ల మేరప్రస్తుతానికి అదనపు ఆదాయం చేకూరింది. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ అధికారులు స్థానిక వైసీపీ నేతల సిఫార్సులు, ఒత్తిళ్లకు తలొగ్గి సరిగా కొలతలు వేయకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు.



- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

పెరిగిన ఆస్తి పన్ను రాబడి



పీఆర్ కమిషనరు కృష్ణతేజ, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జరిపిన రీ వెరిఫికేషన్‌తో రూ.పది కోట్ల మేర అదనపు ఆదాయం లభించింది. పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెడుతూ ఆస్తి పన్ను చెల్లించే విధానాన్ని ఆన్‌లైన్ చేశారు. యూపీఐ ద్వారా పన్నుచెల్లించవచ్చు. ప ంచాయతీ సిబ్బందికి ఎక్కడా నగదు రూపంలో పన్ను చెల్లించవద్దు.

- సుశీలాదేవి, డీపీవో



వేదవిద్యార్థులకు కొత్త వస్త్రాలు

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం వస్త్రాలను పంపిణీ చేశారు. ఏడాదికోసారి వేద పాఠశాలలోని విద్యార్థులకు టీటీడీ వస్త్రాలను పంపిణీ చేయడం ఆనవాయితీ. 4 పంచెలు, ఒక దుప్పటి చొప్పున 380 మంది విద్యార్థులకు అందజేశారు. ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శివసుబ్రహ్మణ్య అవధాని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఆనంద్‌సాయి




సుధీర్‌రెడ్డి - ఆనంద్‌సాయి, వాసుకీ

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం టీటీడీ బోర్డు సభ్యుడు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి, ఆయన సతీమణి వాసుకి దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి 15వ పెళ్లి రోజు సందర్భంగా స్వామికి వస్త్రం సమర్పించి దర్శనం చేసుకున్నారు.

కొనసాగుతున్న 'నృత్య వాహిని'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో మూడు రోజులుగా చేపట్టిన నృత్య వాహిని కార్యక్రమం కొనసాగుతూ ఉంది. థాయ్‌లాండ్‌కు చెందిన నృత్య కారులు అక్కడి స్థానిక సంప్రదాయ నృత్యంతో అలరించారు. గుజరాత్‌కు చెందిన కళాకారులు గర్బా నృత్యంతో ఆకట్టుకున్నారు. వీరితో పాటు పలు ప్రాంతాల ప్రతినిధులు వివిధ నృత్య రీతులను ప్రదర్శించారు. వీరిని నృత్య వాహిని నిర్వాహకులు సత్కరించారు. శనివారం ఈ కార్యక్రమం ముగియనుంది.




రింగురోడ్డులో బైక్, కారు ఢీ

● ఒకరికి గాయాలు

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల రింగురోడ్డులో శుక్రవారం బైక్, కారు ఢీకొని ఒకరు గాయపడ్డారు. క్షేత్రపాలకుని ఎదురుగా ఏర్పాటు చేసిన కొత్త రోడ్డులో నుంచి రింగురోడ్డులోకి వస్తున్న బైక్, ఎదురుగా వచ్చిన ఇన్నోవా కారు ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న తిరుపతికి చెందిన వంశీకృష్ణారెడ్డి ఎడమకాలుకి గాయమైంది. అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు.



పదిలం పదిలం పసిహృదయం

● చిన్నారుల గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలన్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి(వైద్యం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'దేశంలో వెయ్యి మంది చిన్నారుల్లో 8 మందికి పుట్టుకతో గుండె జబ్బులు వచ్చే అవకాశాలున్నాయి. వీరిలో 90 శాతం మందికి అవసరాన్ని బట్టి 3 నుంచి 4 ఆపరేషన్లు చేయాల్సి వస్తోంది. అందుకని ప్రతి ఒక్కరూ చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలి' అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని సిటి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో పదిలం పదిలం పసిహృదయం, చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన పేరిట స్విమ్స్‌లోని ఓపీడీ బ్లాక్‌లో పోస్టర్ల ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పురిటి బిడ్డలకు వచ్చే గుండె జబ్బులను దృష్టిలో పెట్టుకొని దానిపై ప్రతీ ఒక్కరికీ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మా తల్లిదండ్రులు సుశీలమ్మ, శ్రీనాదరావు పేరిట శ్రీనాథ సహృదయ సాహితి సంస్థను స్థాపించి అందులో భాగంగా పదిలం పదిలం పసిహృదయం అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో చిన్నారులకు గుండె జబ్బులు ఎందుకు వస్తాయి, దానిని ఎలా గుర్తించాలి, ఎలాంటి ఆపరేషన్లు చేస్తారు అనే విషయాలను స్పష్టంగా వివరించామన్నారు. పోస్టర్ల ద్వారా చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు పోస్టర్ల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్వీఎస్ సత్యనారాయణ చేతుల మీదుగా పుస్తకాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్లా, ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



పసిపిల్లల గుండె జబ్బులకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్ తదితరులు

15కేజీల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు



నిందుతుడు, గంజాయిని చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ హరిప్రసాద్ శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు గురువారం బీఎన్‌కండ్రిగలో ప్రధాన రహదారిలో ఉన్న ఏఎంసీ చెక్‌పోస్టు దగ్గర తనిఖీలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తి తిరుపతికి వెళ్లడానికి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ నుంచి నుంచి ఆటోలో రాగా తనిఖీ చేశారు. అతడి నుంచి 15కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. తహసీల్దార్ శ్రీదేవి, వీఆర్‌ఓలు పంచనామా చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఐ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో శ్రీసిటీ ఎండీ



సత్యవేడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థికాభివృద్ధిలో జపాన్ సంస్థల పెట్టుబడులు విస్తరిస్తూ భారత్ -జపాన్ పారిశ్రామిక బంధం మరింత బలపడుతోందని ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో భారత్-జపాన్ భాగస్వామ్యం సెషన్‌లో రవీంద్ర సన్నారెడ్డి ప్యానెలిస్టుగా మాట్లాడారు. జపాన్ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందన్నారు. శ్రీసిటీ భారతదేశంలో రెండో అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా ఎదిగిందన్నారు. 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన జపాన్ ఎన్‌క్లావ్‌లో 35కుపైగా కంపెనీలు పని చేస్తున్నాయని తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా శ్రీసిటీ స్టాల్

సదస్సులో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యూహాత్మక స్థానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ప్రదర్శించే ఆకర్షణీయ డిజిటల్ ప్రదర్శనలు, త్రీడీ మోడళ్లతో పలువురి దృష్టిని ఆకర్షించింది. ఎఫ్ఎంసీజీ వస్తువులు, వివిధ ఎయిర్ కండిషనర్ బ్రాండ్లు, ఆటో మొబైల్ భాగాలు, వీల్‌చైర్లు, ఇసుజు వాహనాలతో సహా మేడ్, శ్రీసిటీ ఉత్పత్తుల ప్రదర్శన ప్రతినిధులను

శాస్త్రీయ ప్రతిభను గుర్తించడం అకాడమీ బాధ్యత

● భారత శాస్త్ర అకాడమీ సదస్సు ప్రారంభోత్సవంలో రాఘవన్ వరదరాజన్

ఏర్పేడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని జాతీయ విద్యా సంస్థ ఐసర్‌లో భారతశాస్త్ర అకాడమీ 91వ వార్షిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి 150మంది ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్ రాఘవన్ వరదరాజన్ మాట్లాడుతూ.. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఒక చురుకైన సమగ్ర శాస్త్రీయ సంస్థగా ఎదిగి శాస్త్రీయ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలతో ముందంజలో ఉందన్నారు.శాస్త్రీయ ప్రతిభను గుర్తించడం అకాడమీ ప్రధాన బాధ్యత అన్నారు. ఈ ఏడాది జనవరి 1న కొత్త కౌన్సిల్ పదవీ బాధ్యతలు స్వీకరించిందని, అకాడమీ 91వ సంవత్సరంలోకి ప్రవేశించిందన్నారు.ప్రచురణ రంగంలో ఆకాడమీ 11జర్నల్స్‌లో మొత్తం 1,369 పరిశోధనా వ్యాసాలు ప్రచురించిందన్నారు.ఈ ఓపెన్‌యాక్సెస్ జర్నల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా 46లక్షలకు పైగా డౌన్‌లోడ్స్ రావడం మనకు పెరుగుతున్న గుర్తింపు చూపిస్తోందన్నారు. సమ్మర్ రీసెర్చ్ సీఈవో శివకుమార్ కల్యాణ్‌రామన్ కూడా పరిశోధనలపై ప్రసంగించారు.




మాట్లాడుతున్న రాఘవన్ వరదరాజన్ - ఐసర్‌లో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై వివరిస్తున్న శాస్త్రవేత్త

బయో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు

ఐసర్‌లో ఏర్పాటు చేసిన బయోసైన్స్ ల్యాబ్‌ను గురువారం రాత్రి ఏఎన్‌ఆర్‌ఎఫ్ సీఈవో శివకుమార్ కల్యాణ రామన్ ప్రారంభించారు.కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్‌సింగ్ క్లోహి తదితరులు పాల్గొన్నారు.



ఐసర్‌లో ఏర్పాటు చేసిన నీతికథలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

యువ శాస్త్రవేత్తలకు ఆహ్వానం

తిరుపతి ఐసర్‌లో జరుగుతున్న భారత శాస్త్ర అకాడమీసదస్సు యువ శాస్త్రవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా వుంది. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రముఖ శాస్త్రవేత్తల నుంచి ఎన్నో విజ్ఞాన పరిజ్ఞానాలు యువ శాస్త్రవేత్తలు తెలుసుకోవడానికి వీలుగా వుంది.

- ఎస్వీ చలపతిరావు,
నేషనల్ సెంటర్ ఫర్‌ఎర్త్ సైన్స్ స్టడీస్, త్రివేండ్రం.

పరిశోధనల ఉపయోగంపై చర్చ

దేశంలో జరుగుతున్న పరిశోధనలు పబ్లిక్‌కు ఏ విధంగా ఉపయోగపడతాయో అనే అంశంపై పలువురు శాస్త్రవేత్తలు చర్చలు జరిపారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో మెలకువలపై చర్చలు జరిగాయి. కూరగాయలపంటలపై వస్తున్న వ్యాధులను అరికట్టేందుకు ఎలాంటి పరిశోధనలు చేస్తే బాగుంటుందనే ఎన్నో విషయాలను తెలుసుకున్నాం.

- డాక్టర్ నరసింహ,
వైరాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్,
డీన్ ఎస్వీయూ,తిరుపతి

సదరన్ డిస్కంలో పలువురికి పదోన్నతులు

తిరుపతి (ఆటోనగర్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ డిస్కంలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ శివశంకర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈ సోమశేఖర్‌రెడ్డికి ఎస్ఈగాను, డిప్యూటీ ఈఈ చంద్రానాయక్‌ను ఈఈగాను, అకౌంట్స్ ఆఫీసర్లుగా వున్న శ్రీధర్, నరేంద్రనాయుడును సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే ఏఈలుగా వున్న 25 మందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగాను, ఏఏవోలుగా వున్న ఏడుగురిని అకౌంట్స్ ఆఫీసర్లుగాను, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా వున్న 19 మందిని ఏఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల్లో నమోదై. వారి కుటుంబంలోని వారి సంతాన ఓటరును అనుసంధానంచేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి జేసీ మౌర్య అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ2025పై విజయవాడ నుంచి చీఫ్ ఎలక్ట్రోల్ అధికారి జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జేసీ మౌర్య, ఇతర అధికారులు హాజరయ్యారు. సంతాన ఓటరు అనుసంధానం ప్రక్రియపై సమీక్షించారు. బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇన్‌ఛార్జి జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్యఅర్బన్ తహసీల్దారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



టీటీడీ చైర్మన్‌కు డీడీ అందజేస్తున్న భూషణ్

తిరుమల, నవంబరు14(ఆంధ్ర జ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. విజయవాడకు చెందిన మోనిష్ వెంకట సత్యప్రకాష్ తరపున భూషణ్ తిరుమలలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

'గ్రేటర్' విలీనానికి గాంధీపురం విముఖత

తిరుపతిరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో గాంధీపురం గ్రామపంచాయతీని విలీనం చేయొద్దంటూ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు. సర్పంచ్ ఎం.లక్ష్మీశివ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై విలీనం వద్దు..గ్రామపంచాయతీనే ముద్దు అంటూ నినాదాలు చేశారు. గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పేదలపై పన్నుల భారం మరింతగా పెరుగుతుందని, సమస్యల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మఠంభూములకు విలువని నిర్ధారించి రిజిస్ట్రేషన్‌కి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు అభిప్రాయ తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి లతాశ్రీకి అందజేశారు.

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడి మృతి

పాకాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పాకాల యూనిట్ అధ్యక్షుడు పిఆర్ మునస్వామి (79) శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఈయన మృతికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.జయరామనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు, పాకాల యూనిట్ నేతలు కుప్పుస్వామినాయుడు, కె.రామ్మూర్తి, జి.రామయ్య, కెఎస్ తులసీరామన్, పెన్షనర్లు సంతాపం తెలిపారు.



మునస్వామి (ఫైల్ ఫొటో)